శ్రీరామ

# ఆచారాలు - వైజ్ఞానిక దృక్పథాలు

డా॥ నందివాడ అనంతలక్ష్మి

అనాది అయిన భారతీయ సంస్కృతి ఆచారాల రూపంలో కొనసాగుతూ వచ్చింది. కాలం పెట్టిన పరీక్షలకు నిలిచిన శాస్త్రీయమైన ఆచారాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. అశాస్త్రీయమైన మూఢాచారాలు కాలగర్భంలో కలిసిపోయాయి. మనం పాటించే సంప్రదాయాలు లేక ఆచారాల వెనుక ఉన్న విజ్ఞానం తెలుసుకుంటే ఇష్టంతో ఆచరిస్తాం.



## I. కట్టు - బొట్టు - జుట్టు

**1. వస్త్రధారణ :** చూడగానే ఆకట్టుకునేవి కట్టుకున్న బట్టలు. చలినుండి, ఎండనుండి, వాననుండి, క్రిమికీటకాలనుండి శరీరాన్ని కాపాడుకోవటానికీ వాతావరణానికి తగినట్టు, చేసే వృత్తికి తగినట్టు వస్త్రాలు ధరించటం నాగరకతకు చిహ్నం. ఒక ప్రదేశంలో ఉన్నవారికి పనికివచ్చే ఖనిజాలని, పంటలని అందిస్తుంది నేలతల్లి. అందుకని మన ప్రాంతంలో పత్తి పంట అధికం కనుక ఇక్కడి వాతావరణానికి సరిపోయే నూలు వస్త్రాలు అనుకూలంగా ఉంటాయి. పూర్వకాలంలో చీర అనే పెద్ద వస్త్రాన్ని అందంగా కుచ్చెళ్ళుపెట్టుకుని ఆడవారు మగవారు కూడ కట్టుకొనేవారు. ఇప్పుడు కాలానుగుణంగా ఆ పద్ధతి మారిపోయినా, శరీరాన్నంతా రక్షించటం అనే విషయం మాత్రం అందరూ అంగీకరిస్తారు. మన సంప్రదాయ



వస్త్రధారణ ఘనత ప్రపంచమంతా అంగీకరించింది. కొంతమంది అనుసరిస్తున్నారు కూడ. మనం ఎందుకు వదులుకోవాలి?

**2. బొట్టు**

నుదుట బొట్టు పెట్టుకోవటం గొప్ప శాస్త్రీయ సంప్రదాయం. బొట్టుని తిలకము, నామము అని కూడా అంటారు. సరిగ్గా కనుబొమల మధ్య భాగం ఇడ, పింగళ, సుషుమ్న నాడులు కలిసే చోటు. శరీరంలోని నాడీ మండలం మొత్తాన్ని అదుపులో ఉంచే ఆజ్ఞాచక్రం ఉండేచోటు. సరిగ్గా ఆ ప్రదేశానికి వెనుకభాగంలో మెదడులో ఇంద్రగ్రంధి ఉంటుంది. ఆ ప్రాంతాన్ని సున్నితంగా స్పృశించితే నాడీ మండలం మొత్తం ఉత్తేజితమౌతుంది. దానికి చలువ కలిగించే ఆచ్ఛాదన ఉండటం అవసరం. కనుక పసుపుతో చేసిన కుంకుమని



గాని, (పసుపు క్రిమిసంహారకం, సౌందర్య పోషకం) చందనాన్ని కాని, గోపీ చందనాన్ని కాని, విభూతినికాని, కస్తూరిని గాని, పచ్చకర్పూరం మొదలైన సుగంధ ద్రవ్యాలని కాని, వారి వారి సంప్రదాయాలని అనుసరించి ధరించటం సనాతన సంప్రదాయం. బొట్టు పెట్టుకోవడం వల్ల ఆజ్ఞాచక్రప్రాంతాన్ని ప్రచోదనం చేయటం, దానికి ఆచ్ఛాదన కల్పించటం జరుగుతాయి. మనిషిలో “నేను” అనబడే ప్రజ్ఞకి అంటే “ఆత్మ”కి అధిపతి అయిన సూర్యుడి నుండి వచ్చే హిరణ్మయ (బంగారు) కాంతి రేఖకి ప్రవేశద్వారం ఈ ఆజ్ఞాచక్రం. దానికి రక్షణ మనం ధరించే తిలకం. ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరిగేట్టు చేయగలిగే తిలకధారణ సనాతన భారతీయ ధర్మం మీద విశ్వాసం ఉన్న వారంతా స్త్రీ పురుష బాల వృద్ధ భేదం లేకుండా ఆబాలగోపాలం చేయవలసిందే.ఆహ్వానించటానికి, ఆదరించటానికి, గౌరవించటానికి, ఏ శుభకార్యమైనా

ప్రారంభించటానికి బొట్టుపెట్టటం మన సంప్రదాయం.

**3. జుట్టు**

మనిషికి పుట్టుకతో వచ్చిన నగ (అలంకారం) జుట్టు. పూర్వం పుట్టువెంట్రుకలు తీసిన తరువాత ఎవరూ మళ్ళీ జుట్టు కత్తిరించుకునేవారు కాదట! తరువాతి కాలంలో మగవారు జుట్టు తీసినా 'శిఖ' (సిగ, పిలక) మాత్రం తప్పక ఉంచుకునేవారు. శిఖ వైదిక సంప్రదాయ పరిరక్షణ మాత్రమే కాక సున్నితమైన బ్రహ్మరంధ్రం (మాడు పట్టు) రక్షణ కూడ. శిఖను పెద్ద మెదడు, చిన్న మెదడు కలిసే ప్రదేశంలో ఉంచటం ఆచారం. జుట్టు కత్తిరించుకోకుండా పెంచుకోవటం అనే ఆచారాన్ని ఆడవారు మాత్రమే కొనసాగిస్తున్నారు. జడ అల్లటం, ముడి వెయ్యటం చేయకుండా విరబోసుకోవటం సంప్రదాయం కాదు.



కోరికలకి ప్రతీక, పాపాలకి నిలయం, అందానికి అహంకారానికి కారణం అయిన జుట్టుని తీసి ఇవ్వటం ఒక్క శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో మాత్రమే.

**II.నగలు (భూషణాలు, ఆభరణాలు)**

భారతీయుల అలంకారాలన్నీ అందాన్ని ఆరోగ్యాన్ని పెంచేవే. పైగా ఇవేవీఖరీదైనవి కావు. అందరికీ అందుబాటులో ఉంటాయి.

**1. సుమంగళీ చిహ్నాలు**

స్త్రీలు ధరించే నగలు చాలవరకు ముత్తైదువ చిహ్నాలుగా చెపుతారు. దుద్దులు, ముక్కుపుడక, అడ్డబాస, మంగళసూత్రాలు, మెట్టెలు, గాజులు, నల్లపూసలు లాంటి వన్నీ అలంకారాలేకాదు, ఆరోగ్యప్రదాలుకూడ. ఐదోతనాన్ని పెంచుతాయి అంటే అత్తగారే కోడలి నగల విషయంలో



శ్రద్ధ వహిస్తుంది – కొడుకు ఆయుర్దాయం పెరుగుతుంది కదా!

**అ. మెట్టెలు:**

స్త్రీకి వివాహంతో వచ్చే అలంకారాల్లో ప్రధానమైనవి మెట్టెలు. కాలి బొటనవేలికి పక్కన ఉన్న వేలికి ధరిస్తారు. ఆ వేలి మొదట గర్భాశయానికి సంబంధించిన నాడీవ్యవస్థ ఉంటుంది. దానిని సున్నితంగా వత్తుతూ ఉంటే గర్భకోశం, మొత్తం పునరుత్పత్తి అవయవవ్యవస్థ చక్కగా పనిచేస్తాయి. ప్రత్యేకంగా ఒకచోట కూర్చుని చెయ్యవలసిన పనిలేకుండా బరువైన వెండిమెట్టెలు ధరిస్తే అడుగువేసినప్పుడల్లా వత్తిడి (ఆక్యుప్రెషర్) కలుగుతూ ఉంటుంది. గర్భస్రావాలు, గర్భసంచి తీసివెయ్యాల్సిన పరిస్థితులు రావు. నెలసరి క్రమం తప్పకుండా ఉంటుంది.



**ఆ. మంగళ సూత్రాలు :**

వింధ్యకు దక్షిణ భాగంలో ఉండేవారికి వివాహం అంటే మంగళసూత్ర ధరణ, అంటే తాళికట్టటం మాత్రమే. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే తాటిచెట్టు ఆకులతో తయారుచేసింది కనుక దీనికి 'తాళి' అనే పేరు వచ్చింది. తరువాతి కాలంలో బంగారు తాళిబొట్లు వచ్చాయి. ఈ తాళిబొట్టులో ఒకటి పుట్టింటి వారు, మరొకటి అత్తింటి వారు తెస్తారు. వాటిని పసుపుతాడులో గుచ్చి ధరిస్తారు. వరుడు ఆ బిళ్ళలమీద సరస్వతి, లక్ష్మి, పార్వతులని ఆవాహన చేసి పూజించి వధువు మెడలో కడతాడు. వాటిని చూసినప్పుడల్లా భార్య శక్తి స్వరూపిణి అని గుర్తువస్తుంది. తగుజాగ్రత్తలో ఉండాలని హెచ్చరిక. మంగళసూత్రాలు స్త్రీకి ఒక రకమైన గౌరవాన్ని ఆపాదిస్తాయి.

నల్లపూసలతో పాటు స్త్రీల ఆరోగ్య సంరక్షణకు ప్రధానమైన ముత్యాలు పగడాలని కూడ ఈమంగళసూత్రాలలో కలిపి గుచ్చటం తెలుగువారి అలవాటు. పగడాలు, ముత్యాలు, నల్లపూసలు గుండె ప్రాంతంలో తగులుతూ ఉంటే హృదయానికి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. బంగారం ఉత్సాహం కలిగిస్తుంది. బుద్ధిని వికసింప చేస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. తేజస్సునిస్తుంది. శరీరం మీద విష ప్రభావాన్ని తగ్గిస్తుంది. స్త్రీలకు సహజంగా ఉండే చంద్రదోషాన్ని ముత్యాలు, కుజదోషాన్ని పగడాలు పరిహరిస్తాయి.

తెలుగువారు మంగళసూత్రానికిచ్చే ప్రాధాన్యం ఎంతటిదంటే దేవతామూర్తులకు కూడ మంగళసూత్రాలను ధరింపచేస్తారు.



**ఇ. గాజులు :**

పుట్టినప్పటి నుండి ఆడవారు ధరించే అలంకారాలు గాజులు. ఇవి గాజుతో చేసినవి అని ఆపేరే చెపుతుంది. అందరికీ అందుబాటులో ఉంటాయి. మణికట్టుకి కొద్దిగా క్రిందిభాగం నుండి కొద్దిపైభాగం వరకు ఉన్న ప్రాంతంలో ఉన్న నాడీమండలం మీద చిరువత్తిడి కలిగిస్తే గర్భాశయం ఎటువంటి ఇబ్బందులకి లోను కాదు. ఋతుక్రమం హెచ్చుతగ్గులు లేకుండా సమంగా ఉంటుంది. గాజులు ఆపని చేస్తాయి. గర్భవతి అయిన స్త్రీకి చేతులనిండుగా గాజులు వేయించటాన్ని సీమంతం అనే వేడుకలో అంతర్భాగం చెయ్యటంలోని అంతరార్థం ఇదే. మెట్టెలు, గాజులు ధరించటం వల్లనే పూర్వం గర్భస్రావాలు, గర్భాశయం తీసివెయ్యటాలు ఎక్కువగా ఉండేవి కావు.



స్త్రీల ఆరోగ్యాన్ని కన్నతల్లి లాగా కాపాడే కంకణాలు స్త్రీలకు వరప్రసాదాలు. కాలి చీలమండల దగ్గర ధరించే అందెలు, కడియాల ప్రయోజనం కూడ ఇదే. పురుషులు కూడా పూర్వం చేతులకి కంకణాలు, కాలికి కడియాలు ధరించేవారు, వారి పునరుత్పత్తి అవయవ వ్యవస్థ సరిగా ఉండడానికి.

**ఈ. చెవి కమ్మలు :**

దుద్దులు, కమ్మలు, తాటంకాలు, కుండలాలు అనే పేరుతో ఉన్నవి చెవికి ధరించే నగలు. చెవి తమ్మెకి రంధ్రం చేసి బంగారు తీగెను దానినుండి చొప్పించటం వల్ల నాడీమండలం, ప్రధానంగా జ్ఞాననేత్రంగా చెప్పే ఆజ్ఞాచక్రం ప్రచోదితమౌతాయి. ఆ రంధ్రంలోనుండి బరువైన దానిని పెట్టుకుంటే అవి కదిలినప్పుడల్లా నాడీ మండలం ప్రచోదనం అవుతూ ఉంటుంది. దానివల్ల



బద్ధకం వదలి బుద్ధి చురుకుగా పని చేస్తుంది. పిల్లలలో అల్లరి తగ్గి కుదురు వస్తుంది. అందుకే ఉపనయన సమయం (అప్పటి అక్షరాభ్యాసం)లో చెవులు కుట్టించటం తప్పనిసరిగా ఉండేది. ఆడ, మగ, అనే భేదం లేకుండా అందరు చెవులకు ఏదో ఒక ఆభరణం ధరించేవారు. శరీరంలో ఎక్కడ రంధ్రం చేసినా ధనుర్వాతాన్ని నిరోధించే అవకాశం ఉంది. ఇది కూడ ఆక్యుపంచర్ వైద్యవిధానంలో ఒక భాగం.

**ఉ. ముక్కుపుడక, ముక్కెర, బేసరి, అడ్డబాస :**

శరీరంలో రంధ్రం చేసి ధరించిన బంగారు ఆభరణాలు శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి. ఇవి చెవికమ్మలతో పాటు ముక్కుకి ధరించేవి కూడ.

ముక్కుని రెండు పక్కల కుట్టించి ఒకవైపు ముక్కుపుడక, మరొక వైపు బేసరి పెట్టుకునేవారు. ఒకవైపు అధికంగా ధరించే వలయాకారపు నగని ముక్కెర

అంటారు. ముక్కు దూరాన్నుంచి వేలాడే దానిని అడ్డబాస అంటారు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బంగారం మీద నుండి వీలైతే ముత్యాలు, పగడాలమీదనుండి జరిగితే ఎన్నో కాలుష్యాలు తొలగిపోతాయి. తనకి, ఎదుటివారికి కూడ మంచిది. వర్చస్సుని పెంచే బంగారం అతి తక్కువ పట్టే ఆభరణం ఇది. ఇది కూడా స్త్రీ పురుషులిద్దరూ ధరించేనగ. కృష్ణునివర్ణనలో "నాసాగ్రేనవమౌక్తికం" అన్నది ఈ సంగతిని నిరూపిస్తుంది.

**ఊ. ఉంగరాలు :**

చేతివేళ్ళ మొదట్లో ఉండే నాడీ సముదాయాన్ని ఉంగరాలు ప్రేరేపిస్తూ ఉంటాయి. ఎడమచేతి ఉంగరంవేలు నుండి రక్తనాళం నేరుగా గుండెకి చేరుతుంది. ప్రధానపు ఉంగరం ఈ వేలికే పెట్టటంలోని అంతరార్థం ఇదే, అందుకే, దానికి ఉంగరం పెట్టవలసిన



అవసరం ఉంది. దానిని సూచించటానికి దానికి ఉంగరం వేలు అని పేరు పెట్టటం జరిగింది.

మిగిలిన నగలు తమవైభవాన్ని చాటుకొనేందుకు పనికివస్తాయి.

**III. ఆహార విహారాలు :**

**1. ఆహారం :**

అన్ని ప్రాణుల శరీర పోషణకు ఆహారం చాలా అవసరం. మనం తినే ఆహారంలో ఆరవ వంతు మనస్సుగా మారుతుంది కనుక జ్ఞానజీవి అయిన మానవుడు తగిన ఆహారం ఎన్నుకుని స్వీకరించాలి.

**గుణాన్ని బట్టి ఆహారం – ఆహారాన్ని బట్టి గుణం**

1. శాంతియుత జీవనం గడపదలచినవారు ఆయుష్షునూ, మానసిక బలాన్ని, ఆరోగ్యాన్ని, సుఖాన్ని, ప్రీతిని వృద్ధిచేసే



రసవంతమైన చమురుతో కూడిన సాత్త్వికాహారాన్ని తినాలి.

2. రజోగుణం కలిగినవారు చేదు, పులుపు, కారం, ఉప్పు, చమురు లేనిదీ, ఎక్కువ దప్పిక కలిగించేది శరీరానికి బాధ కలిగించేది, మనస్సుని కలతపెట్టేది అయిన రాజసాహారం ఇష్టపడతారు.

3. హింసాప్రవృత్తిని కలిగించే తమోగుణం కలిగినవారు పాచిపోయినది, బాగా ఉడకనిది, సారం లేనిది, చెడువాసనకలది, ఇతరులు తినగా మిగిలినది, అశుభ్రంగా ఉన్నది అయిన తామసాహారం తింటారు.

జ్ఞానాన్ని సముపార్జించే విద్యార్థి దశలో సాత్త్వికాహారం మంచిది. సాధకులకు, భక్తులకు కూడ సాత్త్వికాహారమే తగినది. కాయకష్టం చేసేవారికి రాజసాహారం అవసరం.



**ఆహారం వల్లనే ఆరోగ్యం :**

వయస్సుని, ఆరోగ్యాన్ని, చేసేపనిని, వాతావరణాన్ని అనుసరించి తీసుకునే ఆహారంలో తేడా పాటించవలసి ఉంటుంది. సాధారణంగా ఉదయం కడుపు నిండా బలమైన ఆహారం తీసుకుని, సూర్యాస్తమయం తరువాత తక్కువ తీసుకోవటం మంచిది. నెలకొకసారి ఉపవాసం ఉండటం ఆరోగ్యానికి మంచిది అని ఆధునిక పరిశోధనలు చెపుతున్నాయి. ఎలా వండాలో, వడ్డించాలో, ఆహారం తీసుకునే సమయంలో ఏక్రమంలో తీసుకోవాలో, నీరు ఎప్పుడు ఎంత తాగాలో కూడా పెద్దలు మనకి చెప్పారు. తినటానికి ముందు దైవప్రార్థన, చివర కృతజ్ఞత చెప్పటం పద్ధతి. ఆహారాన్ని ఎప్పుడూ నిందించరాదు. పాడు చేయరాదు. వృథా చేయరాదు.

దాక్షిణాత్యుల ఆహారపు అలవాట్లు ఉత్తమమైనవని ప్రపంచ ఆహార సంస్థ గుర్తించింది. వాటిలో కొన్ని మజ్జిగ, ఇంగువ, మెంతులు, పసుపు మొదలైనవి వాడటం.

పిల్లలకు పెట్టే చద్దనం, చాలామేలు కలిగిస్తుందని ఆధునిక పరిశోధనలు వెల్లడిచేస్తున్నాయి. చేతితో కలుపుకొని తినటం వల్ల జీర్ణరసం బాగా ఉత్పత్తి అయి, ఆహారం త్వరగా జీర్ణమయి వంటపడుతుందని పరిశోధనలు నిరూపిస్తున్నాయి. అదే విధంగా నేలమీద కూర్చుని తినటం మంచిదని అంగీకరిస్తున్నారు. విదేశీయులు శాస్త్రీయమని నిరూపించి మెచ్చుకునే మన పద్ధతులని మనం వదులుకోవటం ఎందుకు? పాటించి ఫలితం పొందుదాం.



**2. విహారం :**

ఆహారం శరీరానికి పుష్టినిస్తే విహారాలు మనసుకి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చి తుష్టిని చేకూర్చుతాయి. తానున్న సమాజాన్ని, ప్రకృతిని, వ్యక్తులని ఆచారవ్యవహారాలని తెలుసుకోటానికి విహారయాత్రలు దోహదపడతాయి. విద్యార్థులుగా విజ్ఞాన యాత్రలు, తరువాత వినోదవిహారయాత్రలు, ఆపై తీర్థయాత్రలు ధైర్యాన్ని, కలుపుగోలుతనాన్ని, సర్దుకుపోవటాన్ని నేర్పుతాయి. విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత యాగసంరక్షణ నెపంతో విశ్వామిత్రుడు రామలక్ష్మణులని తనతో తీసుకువెళ్లి వారికి అస్త్రాలతోపాటు అందించిన లోకజ్ఞానం దీనికి ఉదాహరణ.

అరణ్యవాస సమయంలో పాండవులని తీర్థయాత్రలు చెయ్యమనటంలో ఉద్దేశం కూడా ఇదే.



**IV. సమాజంలో వృత్తులు :**

మానవుల అవసరాలని బట్టి, కావలసిన వస్తువుల జాబితా పెరిగి వాటిని తయారుచేసేవారి సముదాయాలతో వృత్తులు ఏర్పడినాయి. మనిషి అవసరానికి ఉపయోగపడే అన్ని వృత్తులూ సమానంగా గౌరవించదగినవే. వండుకోటానికి కుండలు, ఇంటికి ఇటుకలు పెంకులు చేసే కుమ్మరి, కత్తులు, కొడవళ్లు, గడ్డపారలు, పలుగులు మొదలైనవి చేసే కమ్మరి, బంగారు నగలు చేసే విశ్వబ్రాహ్మణులు (కంసాలులు) వంటిని కప్పే వస్త్రాలని తయారు చేసే నేతపనివారు (సాలెవారు), నాగళ్లు తలుపులు, స్థంభాలు తయారుచేసే వడ్రంగి, వస్త్రాలని శుభ్రం చేసే రజకులు, మంగళవాద్యకులు.... ఇలా ఎన్నో వృత్తుల సంగమం సమాజం. ఎవరులేకపోయినా లోటే. అందరూ అవసరమే. సమాజపురుషుని శరీరంలో అన్నివృత్తులుగా అవయవాలే.



**V. మర్యాదలు – సంప్రదాయాలు :**

మర్యాద అనే మాటకి క్రమం, నీతి, తీరం, కట్టుబాటు, సమ్మానం అనే అర్థాలున్నాయి. మానవుల ప్రవర్తన విషయానికి వస్తే ఒకరిచేత చెప్పించుకోకుండా తన పరిమితుల (హద్దుల)లో తాను మెలగటం అని చెప్పవచ్చు. మర్యాద మాటలలోను, చేతలలోను కూడ కనపరచాలి.

బీదవాడైన తన మిత్రుడు కుచేలుడు వచ్చినపుడు శ్రీకృష్ణుడు చేసిన అతిథి సత్కారం శ్రీకృష్ణుని మిత్రమర్యాదని తెలియచేస్తుంది. ద్రోణుణ్ణి అవమానపరచిన ద్రుపదుడిది మిత్రమర్యాదని పాటించకపోవటం. దిలీపమహారాజు ఇంద్రుడికి సహాయం చేసివస్తూ కామధేనువుకి నమస్కరించటం అనే మర్యాద పాటించకపోవటం వల్ల శపించబడ్డాడు. జూదం ఆడే సందర్భంలోను, ద్రౌపదిని

సభకి తీసుకువచ్చినప్పుడు దుర్యోధనాదుల ప్రవర్తనలోను మర్యాద లేదు. మర్యాద అన్నదానికి రూపం కల్పిస్తే అది శ్రీరామచంద్రుడు.

కుమారుడుగా, సోదరుడుగా శిష్యుడిగా, అల్లుడుగా, తండ్రిగా, శత్రువుగా, రాజుగా, వీరుడిగా ఎటువంటి ప్రవర్తనకలిగి ఉండాలి అన్నదానికి నిలువెత్తు ఉదాహరణ రాముడు. అందుకే ఆయనను మర్యాదా పురుషోత్తముడిగా పేర్కొనటం జరిగింది. శ్రీకృష్ణుడు కూడ తన ధర్మాలనన్నింటిని తు.చ. తప్పకుండా పాటించి మర్యాదనినిలబెట్టుకున్నాడు. మర్యాదలు ఆచారాలుగా స్థిరపడ్డాయి.

**VI. ఆచారాలు – అంతరార్థాలు :**

సభ్యసమాజంలో మనిషి ప్రవర్తనకు సంబంధించిన కొన్ని ఆచారాలను మనిషి, సమాజాల శ్రేయస్సు దృష్ట్యా ఏర్పాటు చేసుకోవటం జరిగింది. వ్యక్తి



క్షేమం, కుటుంబ సౌభాగ్యం. సమాజశ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ, జ్ఞానబోధ, దేవతాప్రీతి కలగలిపి ఏర్పడినవి ఆచారాలు. తరతరాలుగా ఆచరిస్తూ ఉండడంచేత స్థిరపడిన ఆచారాలు. వీటివెనుక ఉన్న విజ్ఞానం జాతి సాంస్కృతికపురోగతిని సూచిస్తుంది.

**1. ప్రవర్తనకు సంబంధించినవి**

నిద్రలేవటం దగ్గరనుంచి నిద్రపోయేవరకు ప్రతిపని మేలు కలిగేవిధంగా చేయటం మన సంప్రదాయంలో భాగం.

**అ.** పెద్దలు వచ్చినప్పుడు లేచి నిలబడటంవల్ల జీవచైతన్యంలోని అలజడి ఉపశమించి ప్రశాంతత కలుగుతుంది.

**ఆ. నమస్కారం :** నమస్కారం భారతీయ సంస్కారం. పెద్దలని చూడగానే చిన్నవాళ్ళు (వయసులో, అధికారంలో,



జ్ఞానంలో, ధనంలో – ఎందులోనైనా) చేతులు జోడించి నమస్కరిస్తారు మనదేశంలో. నమస్కరించటాన్ని మొక్కటం ప్రణామం చెయ్యటం, దండం పెట్టటం అని కూడా అంటారు. ఈ విధమైన అభివాదాన్ని ఆచారంగా మలచటం వెనుక ఎంతో శాస్త్రీయత ఉంది.

మానవ శరీరం ఒక విద్యుదయస్కాంత ఘటం. ధన ఋణ ధ్రువాలు కలిస్తే విద్యుత్ ప్రవాహ మార్గం (సర్క్యూట్) పూర్తి అవుతుంది. కుడి, ఎడమ చేతివేళ్ళే ఆ ధన, ఋణ ధ్రువాలు. వాటిని జోడించటం వల్ల సర్క్యూట్ పూర్తి అవుతుంది. రెండు ఘటాలు దగ్గరగా వచ్చినప్పుడు, ఎక్కువ శక్తివంతమైన ఘటం సమక్షంలో తక్కువ శక్తి ఉన్న ఘటంలో ప్రకంపనలు కలుగుతాయి. అవి సరిగా, మేలు కలిగించేవిధంగా ఉండటానికి ఏర్పాటు చేసిన ఆచారం నమస్కారం.



ఎదుటి వారిని బట్టి నమస్కరించే పద్ధతి మారుతూ ఉంటుంది. సాష్టాంగ దండ ప్రణామం చేసినప్పుడు శక్తి ప్రసారం జరుగుతుంది. ఒక్కచేతితో నమస్కారం చేస్తే పూర్వజన్మలలో చేసిన పుణ్యం కూడా నశిస్తుంది.

**ఇ.** పెద్దల ఎదుట ఒద్దికగా కూర్చోవాలి. కాళ్లు చాపుకొని కూర్చోరాదు. అనవసరంగా నవ్వటం, అతిగా మాట్లాడటం, ఆవులించటం వంటివి చేయరాదు.

**2. సౌందర్య పోషకాలు :**

సౌందర్యపోషణకు చేసే పనులని కూడ ఆరోగ్యాభివృద్ధితో మేళవించటం భారతీయ సంస్కృతిలో విశేషం. ముఖం అందంగా కనిపించటానికి పెట్టుకునే బొట్టు వెనక ఉన్న విజ్ఞానాన్ని ఇంతకుముందు తెలుసుకున్నాం. ఇప్పుడు మిగిలినవి చూద్దాం.

**అ.కాటుక :**

బొట్టు, కాటుకలని జంటపదాలుగా వాడుతాం. కంటికి చలువచేసి చత్వారం రాకుండా కాపాడుతుంది కాటుక. పూర్వకాలం కళ్ళజోళ్ళు లేకపోవటానికి కాటుక వాడకమే ప్రధానకారణం అయి ఉండవచ్చు. ఆడ, మగ అనే తేడాలేకుండా చిన్న పిల్లలందరికీ కాటుక పెట్టటం మన ఆచారం. కాటుకవల్ల దుర్మాంసాలు (రెప్పలకింద అధికంగా ఉండే చిన్నచిన్న కండరాలు) కరిగి రెప్పలు పలచబడి, కళ్ళు విశాలంగా తయారవుతాయి. కాటుకలో ప్రధానంగా ఉన్న అయొనైజ్డ్ కార్బన్ కళ్ళలో ఉన్న మలినాలని శుభ్రపరుస్తుంది. అవసరానికి తగినట్టుగా రకరకాల కాటుకలని (అంజనాలని) తయారుచేసేవారు మన పూర్వులు.



**ఆ. పసుపు :**

అందాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందించే పసుపుని మంగళ ద్రవ్యంగా గౌరవిస్తారు భారతీయులు. గౌరీదేవిని, వినాయకుణ్ణి పసుపుతో చేయటం, మంగళసూత్రానికి ప్రత్యామ్నాయంగా పసుపుకొమ్ముని ఉపయోగించటం పసుపుకి ఉన్న ప్రాధాన్యం తెలియ చెయ్యటానికే. పసుపులో క్రిమిసంహారక గుణం ఉంది. అందుకే గాయం అయితే పసుపు అద్దుతారు. గుమ్మాలకి పసుపు రాస్తారు. జలుబుకి, ఇతర శ్వాసకోశ వ్యాధులకి, చర్మవ్యాధులకి పసుపు మంచి ఔషధం. పసుపుని నిత్యం వంటలో ఉపయోగించే భారతీయులకి కోలన్‌కాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ అని, జీర్ణకోశవ్యాధులు రావని పాశ్చాత్యులు చేసిన పరిశోధనలు నిరూపిస్తున్నాయి. స్త్రీ సౌందర్యరహస్యం పసుపు.



**ఇ. పారాణి :**

పసుపులో సున్నం కలిపితే తయారయ్యే పారాణి తీవ్రమైన క్రిమిసంహారకం. దివ్యమైన ఔషధం. నిరంతరం నీళ్ళలో, తడిలో పనిచేసే స్త్రీల పాదాలకు రక్షణ. ఇదికూడా మంగళ ద్రవ్యం కనుక వధూవరుల కాళ్ళకు పెడతారు. దిష్టి తియ్యటానికి వాడతారు.

**ఈ. గోరింటాకు:**

గోరింటాకు స్త్రీలకు ప్రకృతి ప్రసాదించిన వరం. చేతులకి, గోళ్ళకి, జుట్టుకి చాలా కాలం నిలిచే రంగుని ఇస్తుంది గోరింటాకు. శరీరంలో ఉన్న వేడిని తగ్గిస్తుంది. సౌందర్యసాధనాలలో ప్రధానపాత్ర గోరింటాకుది. ఇది మంగళద్రవ్యం కూడ.

**ఉ. చందనం (గంధం) :**

భారతీయులకి మాత్రమే స్వంతమైన చందనం



అలదుకోవటం భోగప్రదం, శుభప్రదం, ఆరోగ్యప్రదం, ఆహ్లాదకరం, ఆధ్యాత్మికం. చందనం పూయటం గౌరవానికి సంకేతం. దేవుడికి చేసే పూజలో చందనం తప్పనిసరి ఉపచారం. ఈ అమూల్యమైన మూలిక రక్తదోషాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుంది. ఇది విషహరం. చల్లగా ఉండి, చల్లదనాన్ని ఇస్తుంది. హృదయాన్ని చల్లబరచి, సద్భావాలని కలిగిస్తుంది.

**VII. ఆలయాల్లో ఆచారాలు :**

దేవాలయం మానవ శరీరానికి ప్రతీక. దాని నిర్మాణానికి సంబంధించిన శాస్త్రాన్ని ఆగమశాస్త్రం అంటారు. నామరూపాలకి అతీతమైన దైవానికి మానవులు పంచేంద్రియాలతో గ్రహించటానికి వీలుగా కల్పించుకున్న రూపమే విగ్రహం. దేవాలయాలు దైవశక్తికి కేంద్రాలు మాత్రమేకాదు, ఒకప్పుడు వైద్యాలయాలు, విద్యాలయాలు,

సాంస్కృతిక కేంద్రాలు, న్యాయ నిర్ణాయక, సాంఘిక సంక్షేమ కేంద్రాలు.

ఆలయ ప్రాకారం చర్మం. ధ్వజస్తంభం వెన్నెముక. ప్రధాన ద్వారం నోరు. పక్కన ఉండే గవాక్షాలు కళ్ళు. గర్భగుడి గుండె. మూలవిరాట్టు ఉండే చోటు హృదయంలో ప్రాణం ఉండే చోటు. అక్కడ శక్తి కేంద్రీకృతమై వ్యక్తమయ్యేట్టు చేయటానికి గాను, మూలవిరాట్టును ప్రతిష్ఠచేసే చోట ఆ దేవతా సంబంధమైన రాగితో చేసిన యంత్రాన్ని స్థాపిస్తారు. దానిమీద నవధాన్యాలు, నవరత్నాలు, పంచలోహాలు, పట్టువస్త్రాలు, సుగంధద్రవ్యాలు ఉంచుతారు. రాగి మంచి విద్యుద్వాహిక. భూమిలో ఉన్న అయస్కాంత శక్తిని గ్రహించి ప్రసారం చేస్తుంది. ధ్వజస్థంభం కూడ ఇదేవిధంగా ప్రతిష్ఠిస్తారు. అది అంతరిక్షం నుండి కూడ శక్తిని గ్రహించి ప్రసారం



చేస్తుంది. ఎత్తైన ధ్వజస్థంభం దూరానికి కూడ ఇక్కడ ఆలయం ఉంది అని తెలియచేస్తుంది.

దైవశక్తిని వితరణ చేసే దేవాలయానికి వెళ్ళినప్పుడు ఆ శక్తిని పరిపూర్ణంగా పొందటానికి కొన్ని పద్ధతులని పాటిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

1. ఆలయంలో ప్రవేశించే ముందు కాళ్ళు కడుక్కోవాలి.

2. దర్శనానికన్న ముందు గుడిచుట్టూ ప్రదక్షిణ చేయాలి. దీనివల్ల మూలవిరాట్టు దగ్గర వున్న అయస్కాంత శక్తితో జీవచైతన్యం ఉద్దీపితమౌతుంది. సూర్యుడిచుట్టూ తిరుగుతూ గ్రహాలు శక్తిని పుంజుకున్నట్టు.

3. మూలమూర్తికి ఎదురుగా ఉన్న స్వామి వాహనానికి నమస్కరించాలి.

4. లోపలికి ప్రవేశించగానే గంట మోగించాలి. ఘంటానాదం దుష్టశక్తులని పారద్రోలి, దైవీశక్తులకు ఆహ్వానం పలుకుతుంది.



5. అంతరాలయంలోకి ప్రవేశించేముందు గడపకి నమస్కరించాలి

6. ద్వారపాలకులకి నమస్కరించాలి.

7. గర్భగుడిలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకుని, నమస్కరించి స్తుతించాలి. అర్చనాదికాలు వీలుని బట్టి చేయించుకోవచ్చు. హారతికళ్ళ కద్దుకుని, స్వామి పాదాలుండే శఠారిని శిరస్సునధరించి, దక్షిణ సమర్పించాలి. తీర్థాన్ని స్వీకరించాలి.

8. ఆత్మప్రదక్షిణ నమస్కారం చేయాలి. ఆత్మప్రదక్షిణ నమస్కారం అంటే తన చుట్టూ తాను తిరగటం. దాని వల్ల ఎంతో శక్తి ఉత్పన్న మౌతుంది. ఉదాహరణకి భూమి తన చుట్టూ తాను తిరగడం వల్ల అంతరిక్షంలో నిలిచి ఉంటోంది. బొంగరం గిర్రున తిరుగుతున్నంతసేపు కిందపడకుండా ఉంటుంది.



11. దర్శనం తరువాత ఆలయప్రాంగణంలో కొద్దిసమయం కూర్చోవాలి. అట్లా కూర్చోటం వల్ల దైవదర్శనంతో పొందిన శక్తి స్థిరపడుతుంది.

12. ప్రసాదం కొంత మందికి అయినా పంచిన తరవాత తినాలి.

13. ప్రశాంతమైన మనస్సుతో నేరుగా ఇంటికి వెళ్ళాలి. ఇంటికి వెళ్లిన తరువాత కాళ్ళు కడుక్కో కూడదు.

**VIII. విశ్వాసాలు – శాస్త్రీయత :**

అన్ని జాతులకి వలెనే భారతీయులకి కూడ కొన్ని విశ్వాసాలున్నాయి. వాటిలో చాలవరకు అంధవిశ్వాసాలు కావు. అంధవిశ్వాసాలు అంతరించాయి. సహేతుక మైనవి నిలిచాయి.

ప్రకృతిని భగవత్స్వరూపంగా భావించి, ఆరాధించటం సనాతన సంప్రదాయంలో అంతర్భాగం.

ఎందుకంటే ప్రకృతి భగవంతుడి వ్యక్తరూపం. కనుక ప్రకృతిలోని అన్ని జీవులు, వస్తువులూ, అణువణువు భగవంతుడి రూపాలే. ఈ దృష్టితోనే చెట్టుని, పుట్టని, జంతువులని, పాములని, పక్షులని పూజించటం ఆచారంగా వస్తోంది. ఈ ఆచారాల వెనుక శాస్త్రీయ దృక్పథాలు, ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధానంగా పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మిక పురోగతి చెప్పదగినవి.

**1. నాగుల చవితి :**

కార్తికశుద్ధ చతుర్థినాడు సర్పాలని పూజించటం చాలా ప్రాంతాలలో ఆచారంగా ఉంది. శ్రావణ పంచమినాడు ఉత్తరదేశంలోను, మార్గశిర శుద్ధషష్ఠినాడు దక్షిణదేశంలోను సర్పారాధన జరుపుతారు.

కంటికి కనపడని దేవతలని ఆరాధించి వారికి సమర్పించిన వాటిని ప్రసాదంగా మనమే తీసుకుంటాం.



కంటికి కనపడే వాటిని పూజించటానికి వాటి దగ్గరకే వెళ్ళి సమర్పిస్తాం. నాగులచవితినాడు పాలు, పండ్లు, చలిమిడి, చిమ్మిలి, మొదలైనవాటిని నేరుగా పుట్టలో వేస్తాం. నేరుగా ప్రకృతో సంబంధం ఏర్పరచుకోవటం కోసమే ఇటువంటివి.

సంతానం లేని వాళ్ళని, పిల్లలు పుట్టినా బతకనివాళ్ళని నాగప్రతిష్ఠ చెయ్యమనటం, పుట్టలో పాలు పొయ్యమనటం వెనక ఉన్న శాస్త్రీయతని జ్యోతిశ్శాస్త్రం వివరించింది.

శుక్రధాతువు సర్పాకారంలోఉంటుంది. దానికి పుష్టిని కలిగించడానికి ఆ రూపంలో కంటికి కనపడే సర్పాలని ఆరాధిస్తారు. ఆ పూజావిధానం అంతా శుక్రధాతువు పుష్టిని కలిగించేవిధంగా ఉంటుంది.

జీవచైతన్యం మానవశరీరంలో కుండలిని అనే పేరుతో మూలాధారంలో సర్పాకారంతో మూడున్నర



చుట్టలు చుట్టుకుని నిద్రిస్తూ ఉంటుంది. అది మేలుకొని సహస్రారాన్ని చేరటం యోగసిద్ధి. ఈ శక్తిని మామూలు కంటితో చూడలేం. ఈ కుండలినికి ప్రతీక సుబ్రహ్మణ్య స్వామి. అందుకే ఆయన సర్పాకారంలో ఉన్నట్టుగా చెపుతారు. కనుక ఆయనను ఆరాధించటం కుండలినీ శక్తిని ప్రేరేపించటంలో ఒక భాగం.

నాగుల చవితి నాడు చేసే పూజా విధానంలో ఉడికించని పదార్థాలనే నివేదన చేస్తారు. వాటినే ప్రసాదంగా స్వీకరిస్తారు. పాలు కూడ పచ్చివే. చలిమిడి. చిమ్మిలి, వడపప్పు, పానకం, అరటిపండు, ముగ్గిన జామపండు మొదలైనవన్నీ సత్త్వగుణాన్ని పెంపొందించేవి. చలిమిడి, చిమ్మిలి 'కడపుచలవ' అంటే సంతానోత్పత్తికి అవరోధం కలిగించే దోషాలను తొలగిస్తాయి.

సర్పారాధనకు నిర్దేశించిన సమయం కూడ విశేషమైంది. తిథికి జ్యోతిశ్శాస్త్ర పరమైన ప్రాముఖ్యం కాక,



పర్యావరణ స్పృహ ఉండటం ఆశ్చర్యం. నాగులచవితి సమయానికి పంటపొలాలలో కోతలు పూర్తి అవుతాయి. పొలాల్లో ఉన్న పాములు బయటికివస్తాయి. వాటిని చంపకుండా ఉండాలంటే వాటిపై భక్తిని కలిగించాలి. పాములు పర్యావరణంలో భాగం. పంటలని పాడుచేసే ఎలుకలకు తిరుగులేని విరుగుడు.

**2. గోసేవ (గోపూజ) :**

అనాదిగా గోవును పరమపవిత్రమైన జీవిగా, తల్లితో సమంగా పూజించటం భారతీయ సంప్రదాయం. కామధేనువు సంతతి కనుక, దానితోపాటు జన్మించిన లక్ష్మీదేవి, చంద్రుడు, ఉచ్చైశ్రవం, ఐరావతం, అమృతం మొదలైనవాటి లక్షణాలను పుణికి పుచ్చుకుంది. ఆవుపాలు అమృతంతో, తల్లిపాలతో సమానం. ఆవుపాలు సత్త్వగుణాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తాయి. గోసేవ,

పంచగవ్య సేవనం మనిషికి శారీరక, మానసిక ఆరోగ్యాలని ప్రసాదిస్తాయని ఆయుర్వేదం చెపుతుంది.

విషాన్నితిన్నా దానిని తనమాంసంతో వడగట్టి స్వచ్ఛమైన పాలని ఇస్తుంది గోవు. ఆవు పృష్ఠభాగం లక్ష్మీదేవికి నిలయం.

ప్రాణ వాయువుని పీల్చి ప్రాణవాయువుని వదిలే ఏకైక జీవి గోవు. గోవు శరీరంలోని ప్రతి భాగం, రోమకూపాలతో సహా దివ్యమై దేవతలకు నిలయంగా ఉంటుంది. కనుక ఒక్క గోమాతను పూజిస్తే సమస్తమైన దేవతలను పూజించినట్టే. అందుకే ప్రతి శుభసందర్భంలో గోపూజ ఉంటుంది. గోజాతి పురుషరూపంలో ధర్మానికి, స్త్రీరూపంలో భూమికి ప్రతీక.

ఒకప్పుడు గోవులనే సంపదగా భావించేవారు. దేశసౌభాగ్యం గోసంపద మీదనే ఆధారపడి ఉంటుంది.



దానికి ఉదాహరణ స్విట్జర్‌లాండ్ దేశం. వారు గోవులని ప్రాణప్రదంగా చూస్తారు కనుకనే అన్ని దేశాల ధనం అక్కడికి చేరుకుంటోంది. ఈ విషయం శ్రీకృష్ణుడు 5000 సంవత్సరాలకు ముందే చెప్పాడు. తాను గోపాలకుడై ఆచరించి చూపించాడు కూడ. సౌరశక్తిని నేరుగా గ్రహించే శక్తి ఆవు మూపురంలో ఉంటుంది కనుక మూపురం ఉన్న భారతదేశపు ఆవులే శ్రేష్ఠమైనవి.

**3. తులసి :**

**యన్మూలే సర్వతీర్థాని, యన్మధ్యే సర్వదేవతాః ।**
**యదగ్రే సర్వ వేదాశ్చ తులసి! త్వం నమామ్యహమ్ ॥**

అని ప్రదక్షిణ చేస్తూ ప్రార్థిస్తే సకల శుభాలు కలుగుతాయని. ఈతిబాధలు ఉండవని భారతీయుల విశ్వాసం. తులసికోటలేని ఇల్లు ఉండదు. తులసి దుష్టశక్తులని దరికి రానీయదు. తులసి పవిత్రమే కాదు



ఆరోగ్యప్రదం. "పెరటి వైద్యుడు"గా చెపుతారు. తులసిదళం వేస్తే నీరు తీర్థమై "అకాల మృత్యుహరణం" అవుతుంది. తులసి చెట్లగాలి వాతావరణాన్ని నిర్మలంగా ఉంచటమేకాదు, పదార్థాలు చెడిపోకుండా తాజాగా ఉండేట్టు చేస్తుంది. మలేరియా, నోటి దుర్వాసన, కడుపునొప్పి, దగ్గు, గజ్జి, జలుబు మొదలైన అనేక తరుణ వ్యాధుల నివారణలో తులసిది ప్రధానపాత్ర. క్షీరాబ్ధి ద్వాదశి నాడు తులసికి ఉసిరి చెట్టుకి కల్యాణం చేయటం ఆచారంగా వస్తోంది. పాశ్చాత్యులు దీని ఔషధ గుణాలపై పరిశోధనలు చేస్తూ, తమ పెరళ్ళలో పెంచుకుంటున్నారు.

**4. వేప :**

వేపచెట్టుని లక్ష్మీ స్వరూపంగా భావించి పూజించటం భారతీయుల ఆచారం. వేపచెట్టుగాలి, ఆకులు కాడలు చిగుళ్ళు, పూలు, కాయలు, గింజలు,



కాండం, బెరడు, వేళ్ళు – సమస్తం ఔషధ గుణంతో నిండి ఉన్నాయి. ఈ సంగతి పాశ్చాత్యులు పరిశోధనచేసి నిరూపించారు. ఈ వివరాలు చెప్పకుండానే పూజించమంటే, పెద్దలమాటమీద గౌరవం ఉన్న జాతి కనుక పూజిస్తున్నారు.

**5. రావి :**

రావి ఎన్నో ఔషధ లక్షణాలున్న వృక్షం. అత్యధికంగా ప్రాణవాయువుని ఇస్తుంది. వంధ్యత్వం పోగొట్టే శక్తి ఉన్నది. ఈ చెట్టుని నారాయణుడుగా పూజించటం ఉంది. లక్ష్మీ స్వరూపంగా భావించే వేపచెట్టుకి, నారాయణుడుగా భావించే రావిచెట్టుకి కల్యాణం చేసే సంప్రదాయం ఉంది. వాటి ఔషధీ గుణాలతో పాటు వృక్షాలని గౌరవించటం ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుంది.

**6. ఉసిరి :**

ఉసిరిచెట్టుని కూడ నారాయణుడుగా పరిగణించి పూజించే ఆచారం ఉంది. కార్తికమాసంలో ఉసిరిని తప్పకపూజిస్తారు. ఉసిరి చెట్టుగాలి ఆరోగ్యప్రదం. ఉసిరి పండుకి ఆయుర్వేదంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. ఉసిరిని దానం చేస్తే బంగారాన్ని దానం చేసినంత ఫలం అని అంటారు. ఉసిరిలో పోషకవిలువలు ఎక్కువ. ఒక్కపండులో 6 నిమ్మపళ్లలో ఉన్నంత విటిమిన్ సి ఉంటుందట. ప్రతిరోజు ఉసిరి తినేవారికి ఎటువంటి రోగం రాదట! ఆరోగ్యప్రదాతని పూజించటం కృతజ్ఞత చూపించడం మాత్రమే.

**7. మామిడాకుల తోరణాలు :**

శుభకార్యం అంటే మామిడాకుల తోరణాలు కడతాం. గుమ్మాలకి పసుపు కుంకుమలు పెడతాం. ముగ్గులు తప్పవు. శుభకార్యం అంటే పదిమంది చేరుతారు.



ఎక్కువ ప్రాణవాయువు కావాలి. చెట్టునుండి కోసిన 21 రోజుల వరకు మామిడాకులు ప్రాణవాయువుని విడుదల చేస్తాయి. వాతావరణంలోని చెడు వాసన పోగొడతాయి.

**8. ముగ్గులు (రంగవల్లికలు) :**

స్త్రీల చిత్రలిపి ముగ్గులు – వారి సృజనాత్మకతకు నిదర్శనం. ఇంటి ముందు ముగ్గు లేక పోతే అశుభసూచకం. ముగ్గు సున్నంతో చేసిన పొడి. అది క్రిమికీటకాలను లోపలికి రాకుండా అడ్డుకుంటుంది. పరిశుభ్రతకు సంబంధించిన ఈ అంశాన్ని కళాత్మకంగా, విజ్ఞాన దాయంగా తీర్చిదిద్దిన పద్ధతే ముగ్గులు. ముగ్గులరూపంలో ఎంతో పౌరాణిక విజ్ఞానం తరతరాలుగా అందుతూ ఉంది.

ప్రకృతిలోని అనేక ప్రాణుల, వస్తువుల దివ్యశక్తులని గమనించి వాటిని దేవతా స్వరూపాలుగా నమ్మి పూజించటం అనేది వేదకాలం నుండి వస్తున్న సంప్రదాయం.